క్లుప్తంగా

ముగిసిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు



సత్తెనపల్లి: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు గురువారంతో ముగిశాయి. ఆఖరి రోజు పరీక్షలకు 194 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పట్టణంలో ఆరు పరీక్ష కేంద్రాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం అర్థశాస్త్రం, భౌతిక శాస్త్రం పరీక్షలకు సంబంధించి జనరల్ విభాగంలో 1,571 మంది హాజరు కావలసి ఉండగా 1,385 మంది హాజరు కాగా 186 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 36 మందికి 28 మంది హాజరయ్యారు. 8 మంది గైర్హాజరయ్యారు. పట్టణంలోని సీఎస్ జీఎల్ఎం, ఎస్‌బీజీ పరీక్ష కేంద్రాలను డీఐఈఓ లీలావతిదేవి సందర్శించారు. అంతేగాక స్క్వాడ్ బృందాలు సైతం పరీక్ష కేంద్రాలను సందర్శించాయి.

భక్తిశ్రద్ధలతో శతచండీ మహాయాగం



సత్తెనపల్లి: పట్టణంలోని భవిష్య పాఠశాల సమీపంలో గల త్రిశక్తి దుర్గాపీఠంలో శతాధిక ప్రతిష్ఠా బ్రహ్మ, దేవి ఉపాసకులు, విశ్వధర్మ పరిరక్షణ వేదిక కోశాధికారి, పరమ పూజ్య శ్రీశ్రీశ్రీ హనుమత్‌స్వామి ఆధ్వర్యంలో పంచాయతన పూర్వక నవదుర్గాత్మక శతచండీ మహాయాగం గురువారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. చండీ పారాయణం, శతచండీ హోమం, గురువందనం, ప్రధాన దేవతార్చన, శతచండీ హోమం, లలిత సహస్ర నామార్చన, దీపార్చన, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. సప్త వింసతి నక్షత్ర హోమం, నవగ్రహ మండప దేవత హోమాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా గణేష్ యువసేన, త్రిశక్తి దుర్గాపీఠం బ్రహ్మోత్సవ కమిటీ, త్రిశక్తి దుర్గాపీఠం మహిళా శక్తి బాధ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రెండు లీటర్ల కాపుసారా పట్టివేత



అచ్చంపేట: మండలంలో కాపుసారా బట్టీల నిర్వహణ, విక్రయాలపై విస్తృత దాడులు నిర్వహిస్తున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ టి.తులసి తెలిపారు. మండలంలోని మాదిపాడు పంచాయతీ పరిధిలోని జడపల్లి మోటు తండా వద్ద గంగోడు వాగు సమీపంలో కాపుసారా విక్రయిస్తున్న బాణావతు హనుమంతూనాయక్ వద్ద అమ్మకానికి సిద్ధంగా ఉంచుకున్న రెండు లీటర్ల కాపుసారా స్వాధీనం చేసుకున్నామన్నారు. హనుమంతూ నాయక్‌ను అదుపులోకి తీసుకుని సత్తెనపల్లి కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు పంపినట్లు ఎక్సైజ్ సీఐ తులసి చెప్పారు. బట్టీలు నిర్వహించే వారికి, కాపుసారా విక్రయించే వారికి ఇదే గతి పడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

సత్తెనపల్లి: మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 15న ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల పరిషత్ అధ్యక్షురాలు షేక్ ఎలవర్తిపాటి జైబూన్ బీ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలన్నారు.

ఎన్‌సీడీ సర్వేకు ప్రజలు సహకరించాలి




రాజుపాలెం: ముందస్తు జాగ్రత్తలలో భాగంగా పరీక్షల ద్వారా క్యాన్సర్‌ను నివారించేందుకు అందరు సహకరించాలని వైద్యాధికారి డాక్టర్ రవితేజనాయక్ తెలిపారు. మండలంలోని చౌటపాపాయపాలెంలో నాన్ కమ్యూనికబుల్ డీసీజెస్‌పై ఇంటింటా సర్వే చేపట్టారు. మండల వైద్యాధికారి రవితేజనాయక్ గురువారం ఎన్‌సీడీ సర్వేను పరిశీలించారు. ఈ సర్వే ఒకరి నుంచి మరొకరికి సంక్రమించే వ్యాధులు కాకుండా దురలవాట్ల ద్వారా వచ్చే జబ్బులపై జరుగుతుందని తెలిపారు. ప్రజల జీవన పరిమాణం పెంచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టాయని తెలిపారు. 50 ప్రశ్నలతో సర్వే జరుగుతుందని, ఆరోగ్య సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, కమ్యూనిటీ హెల్త్ అధికారి హన్నాకుమారి, ఏఎన్ఎం ప్రమీలాబాయి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అదనపు లోడు ఇబ్బందులకు చెక్..!

- దృష్టి సారించిన విద్యుత్ శాఖ అధికారులు
- క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ
- గృహ వినియోగదారులకు సదావకాశం
- జూన్ 30 వరకు దరఖాస్తుల స్వీకరణ

బెల్లంకొండ: విద్యుత్ వినియోగం పెరగడంతో సాధారణ బిల్లుతో పాటు డెవలప్‌మెంట్ చార్జీ పేరిట అధిక బిల్లు వస్తుంది. ఇటువంటి సమస్యలను పరిష్కరించుకునేందుకు అదనపు లోడు క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. వినియోగించే విద్యుత్ మీటర్లను క్రమబద్ధీకరించుకోవడం ద్వారా అదనపు చార్జీల నుంచి విముక్తి పొందవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

• గృహ విద్యుత్ అవసరాలకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చే సమయంలో వాడే విద్యుత్ దీపాలు, గృహోపకరణాల వినియోగాన్ని అంచనా వేసి అవసరం మేరకు కిలోవాట్ల లెక్కన డెవలప్‌మెంట్ చార్జీ, సెక్యూరిటీ డిపాజిట్ కట్టించుకుంటారు. దానికి తగిన విధంగానే ఆయా ప్రాంతాల్లో విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేస్తారు. అయితే అప్పటి అంచనాకు మించి అధిక విద్యుత్ ఉపకరణాల వాడకం వల్ల విద్యుత్ వినియోగం పెరిగిపోయి తక్కువ లోడు కోసం ఏర్పాటు చేసిన మీటర్లు తరచూ ట్రిప్ అవుతున్నాయి. అదే విధంగా లో వోల్టేజీ సమస్యలు కలిపి వినియోగదారులు తరచూ ఇబ్బంది పడుతున్నారు. లోడ్ క్రమబద్ధీకరణకు వినియోగదారులు దరఖాస్తు చేసుకుంటే లోడ్‌ను బట్టి మీటర్లు,



విద్యుత్ మీటర్

క్రమబద్ధీకరణ రాయితీల వివరాలు... (ధర- రూపాయలలో)		
అదనపు లోడ్	అసలు ధర	రాయితీ ధర
1 కిలోవాట్	2,250	1,250
2 కిలోవాట్	4,450	2,450
3 కిలోవాట్	6,650	3,650
4 కిలోవాట్	8,850	4,850
5 కిలోవాట్	11,050	6,050

ట్రాన్స్‌ఫార్మర్‌లు మార్చడం వల్ల లో వోల్టేజీ సమస్య తీరనుంది.

క్రమబద్ధీకరణకు అవకాశం...

గృహాల్లో పెరిగిన అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు ప్రభుత్వం 50 శాతం రాయితీతో అవకాశం కల్పిస్తోంది. గతంలో ప్రతి అదనపు కిలోవాటుకు సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.200 నిర్ణయించారు. ఇదే సమయంలో డెవలప్‌మెంట్ చార్జీ రూ.2,000 చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం 50 శాతం రాయితీతో కేవలం రూ.1,000 చెల్లిస్తే సరిపోతుంది. సెక్యూరిటీ డిపాజిట్‌లో ఎటువంటి మార్పు ఉండదు.

సద్వినియోగం చేసుకోవాలి

విద్యుత్ నియంత్రణ మండలి కల్పించిన 50 శాతం రాయితీని గృహ విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి. వినియోగదారులు లోడ్ క్రమబద్ధీకరించుకోవడం ద్వారా అన్ని విధాలా మేలు జరుగుతుంది. లో వోల్టేజీ సమస్యల నుంచి తప్పించుకోవడంతో పాటు నాణ్యమైన విద్యుత్‌ను పొందవచ్చు.

– పవన్ కుమార్, ఏఈ, బెల్లంకొండ మండలం

జూన్ 30 చివరి తేదీ

విద్యుత్ కనెక్షన్ తీసుకున్న నాటికి ఇప్పటికీ విద్యుత్ వినియోగం మూడు నుంచి నాలుగు రెట్లు పెరిగిపోయింది. విద్యుత్ అధికారుల తనిఖీల్లో అదనపు లోడు వినియోగిస్తున్నట్లు గమనిస్తే జరిమానాలు విధించడంతోపాటు లో వోల్టేజీ వంటి సమస్యలు ఎదుర్కోవలసి ఉంటుంది. దీనికి పరిష్కారంగా అదనపు లోడు క్రమబద్ధీకరించుకోవడం ఉత్తమం. దీని కోసం జూన్ నెల 30వ తేదీ వరకు రాయితీ వర్తించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో సంబంధిత విద్యుత్ అధికారులను, లైన్‌మెన్లను సంప్రదించి దరఖాస్తు చేసుకుంటే రాయితీ పొందవచ్చు.

భక్తిశ్రద్ధలతో ఓర్వకల్లు గంగమ్మతల్లి నెల తిరునాళ్ల

అచ్చంపేట: మండలంలోని ఓర్వకల్లులో స్వయంభుగా వెలసిన గంగాదేవి పేరంటాళమ్మ నెల తిరునాళ్ల మహోత్సవాలు గురువారం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి యేటా మాఘ శుద్ధ పౌర్ణమి రోజు అమ్మవారికి తిరునాళ్ల నిర్వహించి, మరుసటి నెలలో వచ్చే పౌర్ణమి నాడు నెల తిరునాళ్ల నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. గత నెల 13వ తేదీన తిరునాళ్లు జరగ్గా, సరిగ్గా నెల రోజుల తరువాత పౌర్ణమి రోజున అమ్మవారికి తిరునాళ్ల నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి, తలనీలాలకు, అమ్మవారి వస్త్రాలు విక్రయాలకు, ప్రసాదాలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు సమర్పించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అచ్చంపేట సీఐ వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.



పూజలందుకున్న గంగమ్మతల్లి

రూపెనగుంట్లలో సర్వే ప్రక్రియ పరిశీలన



నకరికల్లు: అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేసి వారికి దీర్ఘకాలిక ప్రయోజనాలతో పాటు లాభాలు వచ్చే విధంగా చేసేందుకు ఈ ఉగాది నుంచి పీ 4 విధానాన్ని ప్రభుత్వం అమలులోకి తీసుకురానున్నట్లు మండల ప్రత్యేకాధికారి హీరాలాల్ తెలిపారు. మండలంలోని రూపెనగుంట్ల గ్రామంలో చేపడుతున్న సర్వేను గురువారం ఆయన పరిశీలించి సర్వే సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల పెట్టుబడితో ప్రజలు కూడా భాగస్వాములు అయ్యేందుకు సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. దేచవరం, రూపెనగుంట్ల గ్రామాల్లో సర్వే వెనుకబడి ఉండడంతో రెండు గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఎంపీడీఓ జి.కాశయ్య మాట్లాడుతూ సర్వేను సకాలంలో పూర్తి చేయకుంటే మెమో జారీ చేస్తామని రూపెనగుంట్ల గ్రామ కార్యదర్శి బి.దుర్గారావును హెచ్చరించారు. కార్యక్రమంలో మానిటరింగ్ అధికారి శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ కె.వి.శివప్రసాద్, సీసీ కనకారావు, కార్యదర్శి దుర్గయ్య పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై రైతులకు శిక్షణ

రాజుపాలెం: మండలంలోని అంచులవారిపాలెం రైతు సేవా కేంద్రంలో ఉద్యాన పంటలపై రైతులకు గురువారం శిక్షణ జరిగింది. ఈ శిక్షణలో ఉద్యాన శాస్త్రవేత్త ఎన్.నగేష్ మాట్లాడుతూ మామిడి పంటలో పిందెలు రాలకుండా 15 రోజులకు ఒకసారి నీటిని అందించాలని తెలిపారు. పదేళ్లు పైబడిన తోటలలోని ఒక్కొక్క మొక్కకు కేజీ యూరియా, 750 గ్రాముల పొటాష్ కలిపి వేయాలని అన్నారు. మండల ఉద్యాన అధికారి డి.నవీన్ మాట్లాడుతూ ఉద్యాన పంటలకు ప్రభుత్వం రాయితీలు ప్రకటించిందని తెలిపారు. పూల తోటలకు హెక్టారుకు రూ.10 వేల నుంచి రూ.20 వేలు, హైబ్రీడ్ కూరగాయలకు రూ.20 వేల నుంచి రూ.24 వేలు, డ్రాగన్ ఫ్రూట్స్‌కు రూ.30 వేల నుంచి రూ.1.30 లక్షలకు, అరటి తోటలకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు రాయితీలు పెరిగినట్లు తెలిపారు. అదే విధంగా పామాయిల్ తోటలకు తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకులు రమేష్, సుచరిత, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉద్యాన శాఖ అధికారి

నేడు గంగమ్మ తల్లి తిరునాళ్ల

పెదకూరపాడు : కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా భక్తులు విశ్వసించే గంగమ్మ తల్లి తిరునాళ్ల శుక్రవారం పెదకూరపాడు మండలం గారపాడు గ్రామంలో నిర్వహించనున్నారు. గంగమ్మ తల్లి తిరునాళ్లకు రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకుంటారు. భారీ ప్రభలు కట్టి, సామూహికంగా పొంగళ్లు పొంగించి, అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు. తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ గిరిబాబు తెలిపారు.

గృహ నిర్మాణ లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయం

క్రోసూరు: మండలంలో పీఎంఏవై(1.0) స్కీము కింద గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ప్రభుత్వం అదనంగా ఆర్థిక సహాయం చేస్తుందని ఎంపీడీవో జి.శ్రీనివాస్ గురువారం తెలిపారు. క్రోసూరు మండలంలో వివిధ దశల్లో ఉన్న(బేస్‌మెంట్ లెవల్ నుంచి రూఫ్ వరకు) లబ్ధిదారులకు అదనంగా ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీ రూ.75 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కులాల వారీగా లబ్ధిదారులు ఎస్సీలు–219, ఎస్టీ–38, బీసీ–184 మంది మొత్తం 441 మంది ఉన్నారని వివరించారు. అదనపు ఆర్థిక సహాయం దశల వారీగా ఇవ్వటం జరుగుతుందని చెప్పారు. కాగా గృహ నిర్మాణ దశను బట్టి ఎస్సీ, బీసీలకు రూ.15 వేలు, ఎస్టీలకు రూ.22,500, ఇస్తారని తెలిపారు. ఈ ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు జూన్ నెలాఖరుకల్లా వినియోగించుకోవాలని కోరారు. ఇళ్లు త్వరగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో తెలిపారు.



ఎంపీడీవో జి.శ్రీనివాస్

ఎస్సీ, బీసీ, ఎస్టీ గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఆర్థిక చేయూత

సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఉత్తర్వుల ప్రకారం సత్తెనపల్లి మండల పరిధిలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ్) పథకం ద్వారా పక్కా గృహాలు నిర్మించుకునే లబ్ధిదారుల్లో ఎస్సీ, బీసీ, ఎస్టీ లబ్ధిదారులకు ఆర్థిక చేయూత కింద రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రుణం మంజూరు చేస్తుందని ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు. ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అదనంగా అందజేయడం జరుగుతుందన్నారు. సత్తెనపల్లి మండల పరిధిలో గృహాలు నిర్మించుకునే ఎస్సీ, బీసీలు 680 మంది, ఎస్టీలు 68 మంది లబ్ధిదారులు ఉన్నారన్నారు. త్వరితగతిన గృహ నిర్మాణాలు పూర్తి చేసి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఆయనతో పాటు గృహ నిర్మాణ శాఖ ఏఈ సుబ్బారావు ఉన్నారు.

కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

ఎంపీడీవో పార్వతి


పెదకూరపాడు : బీసీ, కాపు కార్పొరేషన్‌లకు, బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ యువతీ యువకులు, నిరుద్యోగులు స్కిల్ డెవలప్‌మెంట్ కోసం రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని గురువారం ఎంపీడీవో పార్వతి తెలిపారు. ఏపీఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 22లోపు రుణాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని వెల్లడించారు. కుల, ఆదాయ, ఆధార్ కార్డు, పాన్ కార్డ్, బ్యాంక్ అకౌంట్, రేషన్ కార్డ్, సంబంధిత విద్యార్హతల ధ్రువపత్రాలతో మీ సేవ, గ్రామ సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



పెదకూరపాడు : గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం అమరావతిలో చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం అమరావతి నుంచి సత్తెనపల్లి వెళ్లే రహదారిలో ఆరుడొంకల వద్ద గురువారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది పడి ఉన్నట్లు సమాచారం అందిందన్నారు. వయసు సుమారు 45 సంవత్సరాలు, 5.7 అడుగుల ఎత్తు, ఎరుపు రంగు, మెడలో నల్లపూసల దండ ఉన్నట్లు తెలిపారు. గత రెండు మూడు రోజుల నుంచి అమరావతిలోని వివిధ ప్రాంతాల్లో హిందీ మాట్లాడుతూ సంచరించినట్లు స్థానికులు తెలిపారన్నారు. మృతదేహాన్ని అమరావతి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్లు వెల్లడించారు. వివరాలు తెలిసినవారు 9440796217, 8555960221 నెంబర్లను సంప్రదించాలన్నారు.

పరివర్తన పాఠశాలలో అన్నసంతర్పణ



సత్తెనపల్లి: పట్టణంలోని పరివర్తన చెవిటి, మూగ, మానసిక వికలాంగుల ఆశ్రమ పాఠశాలలో భీమినేని నాగేశ్వరరావు, వందనాదేవిల మనవడు తల్లపనేని సూర్య (కెనడా) మంచి మార్కులు సాధించినందున గురువారం అన్న సంతర్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా కొద్దిసేపు మానసిక వికలాంగులతో మమేకమయ్యారు. అనంతరం బిస్కెట్లు, కేకులు పంపిణీ చేసి అన్న సంతర్పణ నిర్వహించారు. దాతలకు పరివర్తన పాఠశాల నిర్వాహకుడు కె.కిషోర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ తోట అంబిక, గొర్రెపాటి సుశీల, కందిమల్ల రజిని, బోడెంపూడి రాజేశ్వరి, గద్దె అనురాధ తదితరులు ఉన్నారు.

న్యాయవాదుల పట్ల పోలీసుల వివక్ష సరికాదు

సీనియర్ న్యాయవాది బత్తిన శ్రీనివాస బాబు

సత్తెనపల్లి: న్యాయవాదుల పట్ల పోలీసుల వివక్ష సరైనది కాదని సీనియర్ న్యాయవాది బత్తిన శ్రీనివాస్ బాబు అన్నారు. నూజివీడులో న్యాయవాది కొలుసు సీతారాంపై దాడిని ఖండిస్తూ అక్కడ పోలీసులు కేసు కూడా నమోదు చేయకపోవడాన్ని వ్యతిరేకిస్తూ సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి న్యాయ దేవత విగ్రహం వద్ద గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బత్తిన శ్రీనివాస్ బాబు మాట్లాడుతూ ఒక కేసుకు సంబంధించిన సమాచారం పోలీసులకు చేరినప్పుడు కేసు రిజిస్టర్ చేయాలన్నారు. న్యాయవాదే బాధితుడిగా ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయకపోవడం చట్ట వ్యతిరేకమన్నారు. న్యాయవాది పట్లనే పోలీసులు చట్ట వ్యతిరేకంగా ప్రవర్తిస్తే ఇక సామాన్యులకు ఏమి న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వ పెద్దలు శాంతి భద్రతలు కాపాడతామని అంటున్నారు గానీ న్యాయవాదులపై వరుసగా జరుగుతున్న దాడులు చూస్తే ఆచరణలో అమలు కావడం లేదనేది తేటతెల్లమవుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కఠినంగా చర్యలు తీసుకోకపోతే పౌర హక్కులు ప్రజలకు అందే పరిస్థితి ఉండదనే విషయాన్ని గమనించాలన్నారు. ఈ సందర్భంగా మహారాష్ట్రలో ఇటీవల బాంబే హైకోర్టు ఎన్‌కౌంటర్‌లో ఇచ్చిన తీర్పును ఆయన వివరించారు. అనంతరం న్యాయవాదులు న్యాయవాది కొలుసు సీతారాంకు జరిగిన అన్యాయాన్ని ఖండిస్తూ నినాదాలు చేశారు. న్యాయవాద పరిరక్షణ చట్టాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ తాజా మాజీ అధ్యక్షుడు కంబాల అనిల్‌కుమార్, ప్రధాన ఎన్నికల అధికారి గుజ్జర్లపూడి మార్కురావు, న్యాయవాదులు నరిశేటి వేణుగోపాల్, మద్దినేని వెంకటచలపతిరావు, దివ్వెల శ్రీనివాసరావు, గంగూరి అజయ్‌కుమార్, పూదోట రాజు, చావా బాబూరావు, తవ్వా హరినాథ్, కె.శ్రీనివాస్, జి.సురేష్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ న్యాయవాది బత్తిన శ్రీనివాస్‌బాబు, పక్కన న్యాయవాదులు

తాపీ మేస్త్రీలకు, కార్మికులకు బీమా బాండ్ల పంపిణీ

నకరికల్లు: శ్రమజీవులైన భవన నిర్మాణ కార్మికులకు, మేస్త్రీలకు అండగా నిలిచేందుకు భారతి సిమెంట్ వారిచే రూ.1 లక్ష ఉచిత బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆ సంస్థ టెక్నికల్ సర్వీసెస్ సీనియర్ ఆఫీసర్ ఎస్.భవానీ శంకర్ అన్నారు. భవన నిర్మాణ రంగ కార్మికులకు, మేస్త్రీలకు స్థానిక శ్రీలక్ష్మీ కమలా ట్రేడర్స్‌లో అవగాహనా సదస్సు నిర్వహించి ఇన్సూరెన్స్ బాండ్లను పంపిణీ చేశారు. భవన నిర్మాణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇసుక, కంకర, సిమెంట్ కలపాల్సిన విధానం వివరించారు. మార్కెటింగ్ సీనియర్ ఆఫీసర్ కె.జయరాంరెడ్డి మాట్లాడుతూ అత్యధిక సాంకేతిక పరిజ్ఞానంతో, అత్యంత నాణ్యతా ప్రమాణాలతో తయారు చేసిన నాణ్యమైన భారతి సిమెంట్‌ను ఎంచుకోవడం ద్వారా ఎక్కువకాలం మన్నిక ఉంటుందని తెలిపారు. భారతి సిమెంట్‌తో స్లాబ్ వేస్తే తమ సంస్థ ప్రతినిధులు వారం రోజుల వ్యవధిలో వచ్చి నాణ్యతను పరిశీలిస్తారని అన్నారు. అనంతరం సిమెంట్ వినియోగంపై కార్మికులు, మేస్త్రీల సందేహాలను నివృత్తి చేశారు. కార్మికులకు, మేస్త్రీలకు రూ.1 లక్ష ఉచిత బీమా కల్పించిన బాండ్లను అందజేశారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మీ కమలా ట్రేడర్స్ డీలర్ సుబ్బారెడ్డి, పలు గ్రామాల మేస్త్రీలు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



బీమా బాండును అందజేస్తున్న టెక్నికల్ సర్వీసెస్ సీనియర్ ఆఫీసర్ భవానీ శంకర్, డీలర్ సుబ్బారెడ్డి

16న భారత కమ్యూనిస్టు పార్టీ శత వార్షికోత్సవాలు

పెదకూరపాడు : శత వార్షికోత్సవంలో భాగంగా పెదకూరపాడులో ఈ నెల 16న అమరవీరుల సంస్మరణ సభను నిర్వహించనున్నట్లు జిల్లా సీపీఐ కార్యదర్శి ఏ మారుతి వరప్రసాద్, సహాయ కార్యదర్శులు షేక్ హుస్సేన్, కాసా రాంబాబు, సీపీఐ కార్యవర్గ సభ్యులు కొమ్మాలపాటి శరత్ జ్యోతిశ్రీ, పెదకూరపాడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం గోడ పత్రికలను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ పెదకూరపాడు శాఖ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధులు, కమ్యూనిస్టు యోధులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాధకులు, పాఠశాల నిర్మాణ సారథి, మాజీ శాసనసభ సభ్యులు, మాజీ సర్పంచ్ కామ్రేడ్ దర్శి లక్ష్మయ్య, కమ్యూనిస్టు పార్టీ నాయకులు కామ్రేడ్ దర్శి పానకాలరావు, తెలంగాణ సాయుధ పోరాట యోధులు కామ్రేడ్ అంబటి హనుమంతరావు పెదకూరపాడు నియోజవర్గంలో భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ బలోపేతానికి బడుగు బలహీన వర్గాల కోసం అనేక పోరాటాలు నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సీపీఐ సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర జిల్లా నాయకులు పెద్ద ఎత్తున పాల్గొంటారన్నారు.



ముస్తాబవుతున్న అమరవీరుల స్థూపం

ఘనంగా కవయిత్రి మొల్లమాంబ జయంతి



మొల్లమాంబ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు



వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మొల్ల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



మొల్ల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రామ పెద్దలు

సత్తెనపల్లి: బీసీ సంఘం నాయకులు మోదుగుల బాబ్జీ ఆధ్వర్యంలో కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలు పట్టణంలోని రైల్వే గేటు సమీపంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మొల్లమాంబ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంఘం నాయకులు మాట్లాడుతూ ఆనాటి కాలంలో మహిళల్లో అభ్యుదయ భావాలు కల్గించిన మాతృమూర్తి మొల్లమాంబ అని కొనియాడారు. స్త్రీకి విద్య అవసరం లేదని, అక్షరాస్యత వైపు అడుగులు వేయాల్సిన పనిలేదని మహిళలను పక్కనపెట్టిన ఆ రోజుల్లో తన కలంతో అందరికీ సమాధానం చెప్పి రామాయణాన్ని తెలుగులో రచించిన తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ అన్నారు. స్త్రీలు సాహిత్యంలో ఏ మాత్రం తక్కువ కాదని, ప్రకృతిని ఆరాధించి, సమాజాన్ని ప్రేమించే ప్రతి ఒక్కరు సాహిత్య ప్రియులేనన్న సత్యాన్ని అక్షర రూపం చేసిందన్నారు. స్పందించే హృదయం ఉంటే చాలు సాహిత్యంలో స్త్రీలు కూడా తక్కువ కాదని నిరూపించిందన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు గుంటూరు గోవిందు, కుమ్మరి దస్తగిరి, పిక్కిలి శివ, యర్రగొర్ల శ్రీనివాస్, ఒంటిపులి అరుణ్ కుమార్, చింకా అంకమ్మ రావు తదితరులు పాల్గొన్నారు.

తొలి తెలుగు కవయిత్రి మొల్ల

సత్తెనపల్లి: సంస్కృత రామాయణాన్ని తెనుగీకరించిన తొలి తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ అని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో మొల్లమాంబ జయంతి వేడుకలు బీసీ నాయకుడు, 1వ వార్డు కౌన్సిలర్ వరికల్లు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చల్లంచర్ల సాంబశివరావు మాట్లాడుతూ మొల్లమాంబ రాసిన మొల్ల రామాయణాన్ని ప్రజలకు తెలియజేయడానికి రంగనాథ రామాయణం తప్ప ఇంకోటి లేదన్నారు. విలువలతో కూడిన కవిత్వాన్ని సమాజానికి అందించిన కవయిత్రి మొల్లమాంబ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమన్నారు. కవిత్వమైనా.. బోధనలైనా ప్రజల మనసుల్లో సుస్థిరమైన స్థానాన్ని ఏర్పరచుకున్నప్పుడే వారు చిరస్థాయిగా నిలిచిపోతారని, ఆ కోవకు చెందిన వారిలో మొల్లమాంబ అగ్రగణ్యులని కొనియాడారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, నాయకులు రాజవరపు శివనాగేశ్వరరావు, తుమ్మల వెంకటేశ్వరరావు, అచ్యుత శివప్రసాద్, లోక మాధవ, పెద్దింటి వెంకటేశ్వర్లు(చిట్టి), శిరిగిరి వెంకట్రావు, సంకుల తిరుములరావు, వల్లెం నరసింహారావు, వాకుమళ్ళ చెంచిరెడ్డి, ఉల్లంఘుల ప్రసాద్, హైదరాబాద్ సుభాని, వరికల్లు కోటిలింగం, బొమ్మరబోయిన శ్రీనివాస్, రాజరాపు సాంబయ్య, శాలివాహన సంఘ సభ్యులు ఉన్నారు.

కవయిత్రి మొల్ల సమాజానికి ఆదర్శం

పెదకూరపాడు: కవయిత్రి మొల్ల రచనలు సమాజానికి ఆదర్శమని పెదకూరపాడు అభివృద్ధి వేదిక ప్రతినిధులు అన్నారు. గురువారం పెదకూరపాడులోని కచేరి సెంటర్‌లో మొల్ల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత మొల్ల ధైర్యాన్ని, చొరవని అందిపుచ్చుకొని ప్రస్తుత సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ ఆయా రంగాలలో రాణించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాకవి దర్శి శేషారావు, మాజీ యార్డ్ చైర్మన్ బెల్లంకొండ రాంగోపాలరావు, మాజీ ఎంపీపీ గళ్ళా బాబురావు, రిటైర్డ్ హెడ్ మాస్టర్ మన్నవ వీరయ్య, పెదకూరపాడు ఉపసర్పంచ్ జాగర్లమూడి రఘుపతిరావు, కాల్వ అప్పారావు, టీచర్ సాంబశివరావు, టీచర్ రాధాకృష్ణ, శ్రీనివాసరావు, సత్యనారాయణ, మల్లు, నరసింహారావు, సంజీవరావు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రిన్స్‌పాల్ మేరీసుజన్



క్రోసూరు: క్రోసూరులోని ఏపీ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజిలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్స్‌పాల్ మేరీసుజన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి ఫీజులు లేకుండా ప్రతిష్టాత్మక మోడల్ స్కూల్ అండ్ కాలేజిలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో చేరేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. గుర్తింపు పొందిన ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి పాసై ఉన్న విద్యార్థులు అర్హులని, ఈ నెల 17 నుంచి 22 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు వెబ్‌సైట్ http: //apms.apcfss. in,http://cse.ap.gov.inలను చూడవచ్చన్నారు. ప్రవేశాలు పదవ తరగతి మెరిట్, రిజర్వేషన్ రూల్స్ ప్రకారం జరుగుతాయని వివరించారు.